పాయకరావుపేటలో టీడీపీ విజయకేతనం


అనకాపల్లి మండలం శంకరంలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది


అనితను అభినందిస్తున్న నాయకులు

నక్కపల్లి : ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ విజయకేతనం ఎగురవేసింది. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగల పూడి అనిత తన సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులుపై 43,061 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం ఓట్లు లెక్కింపు జరిగింది. మొత్తం 21 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. లెక్కింపునకుగాను 14 టేబుళ్ల ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,50,744 మంది ఓటర్లు ఉన్నారు. గత నెల 13న జరిగిన పోలింగ్‌లో 2,06,626 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్ వంటి ప్రధాన పార్టీ అభ్యర్థులతోపాటు కలిపి తొమ్మిది మంది పోటీలో ఉన్నారు. పోలయిన ఓట్లలో టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితకు వచ్చిన ఓట్లు 1,18,675 ఓట్లు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులకు 75,614 ఓట్లు వచ్చాయి. మిగిలిన వారిలో కాంగ్రెస్ అభ్యర్థి బోని తాతారావుకు 2059 ఓట్లు, దళిత బహుజన పార్టీ అభ్యర్థి కృష్ణస్వరూప్‌కు 1770 ఓట్లు, బహుజన సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి కాకర నర్సింగరావుకు 1632 ఓట్లు, ప్రభుద్ధ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి పరవాడ రామకృష్ణకు

43 వేల పైచిలుకు ఓట్లతో అనిత గెలుపు

284 ఓట్లు, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి దూలపల్లి నాగేశ్వరరావుకు 257 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి బూర్తి ఏసియ్యకు 540 ఓట్లు, మరో ఇండిపెండెంట్ అభ్యర్థి ఎస్.ధర్మరాజుకు 284 ఓట్లు వచ్చాయి. నోటాకు 4090 ఓట్లు రావడం విశేషం. లెక్కింపు ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి టీడీపీ తన ఆధిక్యతను కొనసాగిస్తూ వచ్చింది. కోటవురట్ల మండలం నుంచి లెక్కింపు ప్రారంభమైంది. తర్వాత పాయకరావుపేట మండలం తర్వాత నక్కపల్లి చివరగా ఎస్.రాయవరం మండలంలో పోలయిన ఓట్లతో లెక్కింపు ప్రక్రియ ముగిసింది.

నియోజకవర్గ చరిత్రలో ఈ దఫా జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వంగల పూడి అనిత అత్యధికంగా 43వేల పైచిలుకు ఓట్లు మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసిన గొల్ల బాబూరావుకు 31,189 ఓట్ల మెజార్టీ రాగా ఈసారి జరిగిన ఎన్నికల్లో వంగలపూడి అనితకు 43061 ఓట్ల మెజార్టీ రావడం గమనార్హం. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు రావడం విశేషం. టీడీపీ అభ్యర్థి అనిత విజయం సాధించడంతో


కౌంటింగ్‌లో నిమగ్నమైన సిబ్బంది

తెలుగుదేశంతో పాటు, బీజేపీ, జనసేన పార్టీశ్రేణులు సంబరాలు జరుపుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు రికార్డు మెజార్టీ ఇచ్చి తనను గెలిపించినందుకు కృతజ్ఞత లు తెలుపుకొంటున్నానన్నారు. ఈ ఎన్నికల్లో తన గెలుపు నకు కృషి చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులకు ధన్యవాదా లు తెలుపుతున్నానన్నారు. అనితకు నియోజకవర్గానికి చెందిన టీడీపీ జనసేన బీజేపీలకు చెందిన ముఖ్య నాయకులు కొప్పిసెట్టి వెంకటేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, వినోద్‌రాజు, కాశీనాయుడు, అబద్దం, దేవర సత్యనారాయణ, గెడ్డం బుజ్జి , తోటనగేష్, కాశీనాయుడు, పెంకులరాజు, మీగడ సత్తిబాబు, కొప్పిసెట్టి బుజ్జి, రవిరాజు, కురందాసు నూకరాజు, శివదత్, సుధారాజు, కోసూరు శ్రీను, తదితరులు అభినందనలు తెలియజేశారు.

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు పరిశీలిస్తే...

రౌండ్	వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఓట్లు	టీడీపీకి వచ్చిన ఓట్లు	మెజార్టీ
1వ రౌండ్	3570	4630	1060
2వ రౌండ్	4296	5711	1415
3వ రౌండ్	4137	5044	907
4వ రౌండ్	4171	6322	2151
5వ రౌండ్	2716	5171	2455
6వ రౌండ్	2925	4494	1569
7వ రౌండ్	3095	5788	2693
8వ రౌండ్	3247	5057	1810
9వ రౌండ్	4675	5739	1064
10వ రౌండ్	4817	6162	1345
11వ రౌండ్	4458	6425	1967
12వ రౌండ్	3618	5586	1968
13వ రౌండ్	3000	5839	2839
14వ రౌండ్	3852	6787	2935
15వ రౌండ్	3247	6604	3357
16వ రౌండ్	3640	5527	1887
17వ రౌండ్	3689	6165	2476
18వ రౌండ్	3055	6042	2987
19వ రౌండ్	2766	5642	2876
20వ రౌండ్	3896	5725	1829
21వ రౌండ్	2744	4215	1471
	75614	118675	43061

ఉపాధి పథకంతో మెరుగుపడుతున్న
సాగునీటి వనరులు


ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి చెందిన కాలువ

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పథకం ద్వారా కాలువలు, చెరువులతో పాటు రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. గతంలో వ్యవసాయ రంగానికి అవసరమయ్యే సాగునీరు ప్రవహించేందుకు కాలువలు అధ్వానంగా ఉండేవి. దీంతో రైతులు సాగుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఉపాధి హామీ పథకం ద్వారా నేడు పలు సాగునీటి కాలువలు అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అవసరమయ్యే నీరు కాలువలు, చెరువుల పుణ్యమాని అందుతుండడంతో ఈ పథకం మేలు చేస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

యలమంచిలిలో జనసేన జెండా

48,414 ఓట్ల మెజారిటీతో సుందరపు గెలుపు

అచ్యుతాపురం : యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా జనసేన తరపున పోటీ చేసిన సుందరపు విజయ్‌కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఉప్పలపాటి రమణమూర్తిరాజుపై 48,414 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అనకాపల్లి కలెక్టరేట్‌కు సమీపంలోని ఫ్యూచర్ వరల్డ్ స్కూల్లో చేపట్టిన ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా మంగళవారం 18 రౌండ్లు పూర్తి అయ్యేసరికి జనసేన అభ్యర్థి విజయం సాధించారు. సుందరపునకు 1,08,254 ఓట్లు రాగా, రమణమూర్తిరాజుకు 59,840 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన తనకాల అనంత నర్సింగరావుకు 1800 ఓట్లు, బహుజన సమాజ్ పార్టీకి చెందిన లంబా శ్రీనివాసరావుకు 1393 ఓట్లు, నవరంగ కాంగ్రెస్ పార్టీకి చెందిన సుందరపు అర్జున్ కుమార్‌కు 1242 ఓట్లు, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మొల్లేటి రమేశ్‌కు 664 ఓట్లు, రీఫామ్స్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పోటీ చేసిన బోజా నాగేశ్వరరావుకు 619 ఓట్లు, జై భారత్ నేషనల్ పార్టీకి చెందిన దాడి పూర్ణ చంద్రరావుకు 484 ఓట్లు, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ప్రగడ అన్నపూర్ణకు 444 ఓట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పోటీ చేసిన బి.అమ్మాజమ్మకు 348 ఓట్లు, నోటాకు 2385 ఓట్లు లభించాయి.

జనసేనకు మండలం నుంచి 11930 మెజార్టీ

మునగపాక : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మునగపాక మండలం నుంచి జనసేనకు 11930 మెజార్టీ వచ్చింది. మండల వ్యాప్తంగా 45414 ఓట్లకు గాను 39499 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం నిర్వహించిన కౌంటింగ్‌లో జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమీప ప్రత్యర్థి యూవీ రమణ మూర్తిరాజుపై 11930 ఓట్ల మెజార్టీని దక్కించుకున్నారు. ఇందుకు సంబంధించి గ్రామాల వారీగా మెజార్టీలు ఇలా ఉన్నాయి. చెర్లోపాలెంలో 157 ఓట్లు, రామగిరిలో 58 , మడకపాలెంలో 101,మెలిపాకలో 448,చూచుకొండలో 251, గణపర్తిలో 245, గంటవానిపాలెంలో 78, పురుషోత్తపురంలో 86,పల్లపు ఆనందపురంలో 294, అరబుపాలెంలో 294, ఒంపోలులో 653, నాగులాపల్లిలో 1307, ఉమ్మలాడలో 612, తోటాడలో 553, గవర్ల అనకాపల్లిలో 665, సిరసపల్లిలో 494, వెంకటాపురంలో 196, పాటిపల్లిలో 383, నారాయుడుపాలెంలో 76, రాజుపేటలో 187, నాగవరంలో 713, మల్లవరంలో 313, కాకరాపల్లిలో 22, వాడ్రాపల్లిలో 311, గొల్లలపాలెంలో 186, తిమ్మరాజుపేటలో 265, మునగపాకలో 2789, మూలపేటలో 170, గంగాదేవిపేటలో 23 ఓట్ల మేర జనసేన అభ్యర్థి విజయ కుమార్‌కు మెజార్టీ ఓట్లు వచ్చాయి.

భారీ వాహనాల రాకపోకలపై చర్యలేవీ..?


మునగపాక మెయిన్‌రోడ్డులో భారీ వాహనం

మునగపాక : పూడిమడక రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారి దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని ఇటీవల వీఎంఆర్‌డీఏ ద్వారా శాశ్వత మరమ్మతుల పేరిట అభివృద్ధి చేశారు. అయితే భారీ వాహనాలకు ఈ మార్గంలో ప్రయాణం నిషేధం ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ


దిమిలి గ్రంథాలయంలో విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రీసోర్స్‌పర్సన్స్ నీతి కథలు చెప్పారు. ఈ కథల్లో నీతిని పాటించాలని సూచించారు. పేపర్‌క్రాఫ్టులు, కోలాటాలపై అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా ఈ వేసవి శిక్షణలో పాల్గొన్నారు. ఈ నెల 6న వేసవి శిక్షణ ముగుస్తుందని లైబ్రేరియన్ ఎస్. శకుంతల తెలిపారు.

సత్తా చాటని స్వతంత్రులు

- ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపని అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా అందరి డిపాజిట్లు గల్లంతు
- 8 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు

యలమంచిలి రూరల్ : యలమంచిలి ఎన్నికల బరిలో 10 మంది అభ్యర్థులు పోటీ చేయగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు మినహా మిగిలిన 8 మంది అభ్యర్థులు పెద్దగా ఓట్లు సాధించలేదు. యలమంచిలి నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ 48,267 ఓట్ల మెజార్టీతో గెలవగా అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు)కు 59813 ఓట్లు వచ్చాయి. పోటీ చేసిన 10 మందిలో 8 మందికి డిపాజిట్లు గల్లంతయ్యాయి. పోలయిన ఓట్లలో ఆరో వంతు ఓట్లు వస్తే డిపాజిట్ దక్కుతుంది. కానీ ఎవరికీ ఆ మేరకు ఓట్లు రాకపోవడంతో డిపాజిట్లు దక్కలేదు. విశేషమేమిటంటే బరిలో ఉన్న 8 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. నోటాకు 2400 ఓట్లు పడగా మిగిలిన అభ్యర్థులందరికీ అంతకంటే తక్కువే వచ్చాయి. యలమంచిలి నియోజకవర్గంలో ఎన్నికల బరిలో నిలిచిన వారిలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తనకాల అనంత రామ నరసింగరావుకు 1822, బీఎస్పీ అభ్యర్థి లంబ శ్రీనివాసరావుకు 1414, పిరమిడ్ ఆఫ్ ఇండియా అభ్యర్థి బి.అమ్మాజమ్మకు 352, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుందరపు అరుణ్ కుమార్‌కు 1252, దాడి పూర్ణ చంద్రరావు (జై భారత్ నేషనల్ పార్టీ)కు 490, బోజా నాగేశ్వరావు(రీఫామ్స్ పార్టీ ఆఫ్ ఇండియా)కు 633, స్వతంత్ర అభ్యర్థులు ప్రగడ అన్నపూర్ణకు 450,మొల్లేటి రమేష్‌కు 675 ఓట్లు పోలయ్యాయి. యలమంచిలి నియోజకవర్గంలో 1,79,427 ఓట్లు చెల్లుబాటయ్యాయి. ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు అభ్యర్థులు మినహా మిగిలిన వారందరికీ నోటా కంటే తక్కువ రావడం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణకు కృషి చేసిన శ్రీరాములను తెలుగు జాతి మర్చిపోదన్నారు. ఆయన జ్ఞాపకార్థం నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా పేరు పెట్టి 16 ఏళ్లయిందన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి ఘన నివాళులర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకులు పిరట్ల నరసింహ మూర్తి, ప్రతినిధులు గుంగుపాం నాగేశ్వరరావు, లక్ష్మి, స్వాతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాస శివరాత్రి పూజలు

అనకాపల్లి: స్థానిక శారదానది ఒడ్డున బుధవారం ఉదయం 10 గంటలకు మాస శివరాత్రి సందర్భంగా ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో లలితా శివ సహస్ర నామ పారాయణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సాలగ్రామ రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు నేడు

అనకాపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై మూడు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

మండుతున్న ఎండలు


నిర్మానుష్యంగా కశింకోట పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజానీకం సూర్య తాపంతో మంగళవారం సతమతమయ్యారు. కొద్ది రోజులుగా చల్లగా ఉన్న వాతావరణం మంగళవారం మళ్లీ వేడెక్కింది. ఒక్కసారిగా వేసవి ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు విలవిల్లాడారు. ఒక వైపు ఉష్ణోగ్రత, మరో వైపు ఎన్నికల ఓట్ల లెక్కింపుతో ప్రజలు టీవీల ముందు అతుక్కుపోయి ఇళ్లకే పరిమితం కావడంతో కశింకోటలోని పంచాయతీ ప్రధాన రహదారితోపాటు, వీధులన్నీ జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం ఉష్ణ తాపం తగ్గడంతో ప్రజలు తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

చురుగ్గా భవన నిర్మాణం


భవనం పనులు జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ నూతన భవనం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ భవన నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికి అదనపు నూతన భవనం కోసం నిధులు మంజూరు కావడంతో పనులు చకచక జరుగుతున్నాయి. ఈ భవనం పనులు పూర్తయితే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు తొలగినట్టే.

టీవీలకే అతుక్కుపోయిన జనం

యలమంచిలి రూరల్ : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ఫలితాల తీరు వీక్షించేందుకు ఉదయం నుంచే టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయారు. ఎక్కడ ఎవరికి అనుకూలంగా ఓట్లు పడ్డాయి, ఏ పార్టీ ఎన్ని సీట్లలో ఆధిక్యంలో ఉంది, రౌండ్ల వారీగా మెజార్టీలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. కౌటింగ్ స్టేటస్‌ను రాజకీయపార్టీల నాయకులతోపాటు సామాన్యులూ ఆసక్తిగా ఎదురు చూశారు. జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఆఖరి రౌండ్ వరకు ఎన్నికల ఫలితాలను తమ ఫోన్లలో వాట్సాప్ వేదికగా ఇతరులతో పంచుకునేందుకు ఉత్సాహం కనబరిచారు. ఫలితాలు ప్రకటించగానే, తమ వాట్సాప్ స్టేటస్‌లలో పోస్ట్ చేస్తూ సమాచారం అందరికీ చేరవేయడం కనిపించింది.